క్లుప్తంగా

నేడు మెగా రక్తదాన శిబిరం

పాలకొండ రూరల్: దివంగత ముఖ్యమంత్రి, 108 రూపకర్త డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా పాలకొండ ఏరియా ఆస్పత్రిలో శనివారం మెగా రక్తదాన శిబిరం చేపట్టనున్నారు. 108 ఎంప్లాయిస్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, రక్తదాతలు ముందుకు రావాలని 108 సంఘ జిల్లా అధ్యక్షుడు గిరి గణపతి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



వాటపాగులో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాట్లో ఉంటూ సేవలు విస్తృతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. మండలంలోని బుక్కూరు, వాటపాగు, తుమరాడ, రాజుపేట తదితర గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. 344 మందికి నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీపై ఉపాధి హామీ ఏపీఓ ఈశ్వరమ్మ, ఈసీ పద్మజతో కలసి క్షేత్ర పరిశీలన చేపట్టారు. ఈ క్రమంలో సచివాలయాలను సందర్శించారు. అక్కడ సిబ్బందికి స్పష్టమైన సూచనలు చేసారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రజల ఆరోగ్య భద్రత, తాగునీటి వనరులు శుభ్రత, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీసారు.

పక్కాగా ఆరోగ్య పరీక్షలు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

పాలకొండ రూరల్/వీరఘట్టం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు పక్కాగా జరపాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సూచించారు. వండువలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. రికార్డులను పరిశీలించి అనారోగ్య సమస్యలకు ఏ పరీక్షలు నిర్వహించి, ఏ విధమైన చికిత్స అందిస్తున్నారన్నది గుర్తించారు. నిర్ధారించిన పరీక్షల నివేదికలు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. తనిఖీలకు వచ్చిన గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. వైద్య సిబ్బంది అందజేస్తున్న ఐరన్, కాల్షియం మాత్రలు సూచించిన క్రమంలో వేసుకోవాలన్నారు. అనంతరం పాలకొండ పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జగన్నాధరావు పరిశీలించారు. వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వేలో పాల్గొని ప్రజలతో మమేకమై దోమలు పెరగకుండా ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో వివరించారు. ఫ్రైడే – డ్రైడే కార్యక్రమ ఉద్దేశం వివరించారు. కార్యక్రమంలో బిటివాడ వైద్యాదికారి నితీషా, ఎస్‌ఓ ఇందిరాదేవి, డెమో యోగేశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందిస్తున్న ఎంఈఓ సామల సింహాచలం

బలిజిపేట: ఇటీవల జిల్లా కేంద్రంలో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి ఎంఈఓ సామల సింహాచలం బలిజిపేటలో ఎంఆర్‌సీ వద్ద మెడల్స్, సర్టిఫికెట్లు శుక్రవారం పంపిణీ చేశారు. బహుమతులు సాధించి న వారిలో బలిజిపేట ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్.మనోజ్, భోగి సౌమ్య (బంగారు), వంతరాం ఉన్నత పాఠశాల విద్యార్థి యు.కార్తీక్ (రజత), పెదపెంకి ఉన్నత పాఠశాల విద్యార్థి జి.గణేష్, చిలకలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.శివలు (కాంస్య) ఉన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ సామల మాట్లాడుతూ జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచి మండలానికి, పాఠశాలలకు మంచి పేరు సాధించిపెట్టడంతో గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో రాష్ట్రస్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఐఈఆర్టీఎస్ రమణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణ మందు స్ప్రే

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో సర్పంచ్ ఎన్.పాపారావు ఆధ్వర్యంలో దోమల నివారణ మందును శుక్రవారం స్ప్రే చేయించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వీధులు, కాలువలు, చెత్తాచెదారాలు ఉండే ప్రదేశాలలో దోమల మందు స్ప్రే చేయిస్తున్నట్లు సర్పంచ్ ఈ సందర్భంగా తెలిపారు. వర్షాకాలం అవడంతో ఖాళీ ప్రదేశాలలో తుప్పలు, డొంకలు ఎక్కువై దోమలు పెరుగుతున్నాయని వాటిని నియంత్రించకపోతే వైరల్ జ్వరాలు సోకే ప్రమాదముందన్నారు. ప్రజలు చెత్తాచెదారాలను పోగులుగా ఉంచవద్దని కోరారు. అలాగే మురుగు నీటి నిల్వలు లేకుండా చూడాలని పిలుపునిచ్చారు. వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పాలకొండ: అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో ఉన్న భక్తులు



పాలకొండ: బంగారు ఆభరణాల అలంకరణలో కోటదుర్గమ్మవారు



పాలకొండ: ప్రత్యేక అలంకరణలో పంచముఖ రుద్ర గాయత్రీదేవి

ఆలయాల్లో శ్రావణ శోభ



భామిని: బత్తిలి సంతోషిమాతా ఆలయంలో కిక్కిరిసిన భక్తులు



వీరఘట్టం: కోటదుర్గతల్లి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పాలకొండ: శ్రావణ మాసం మూడవ శుక్రవారం దేవాలయాల్లో సందడి నెలకొంది. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మవారి ఆలయంలో పెద్ద సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. కొండాపురం సమీపంలో ఉన్న పంచముఖ రుద్ర గాయత్రి ఆలయంలో అమ్మవారి ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు బంకుపల్లి చిట్టిబాబు శర్మ చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

వీరఘట్టం: శ్రావణ మాసం మూడవ శుక్రవారం పురస్కరించుకుని స్థానిక కోటదుర్గ తల్లి ఆలయం వద్ద యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రావణలక్ష్మికి కుంకుమ పూజలు చేశారు. అలాగే పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద కూడా మహిళలు పూజలు చేశారు.

భామిని: మండలంలోని బత్తిలి సంతోషిమాతా ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ శుక్రవారం కావడంతో ఉదయం నుండే మహిళా భక్తులు ఆలయం ముందు బారులు తీరారు. ఆంధ్రా – ఒడిశా గ్రామాల నుండి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేసింది. బత్తిలి శ్రీలలిత త్రిపుర సుందరి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు జరిగాయి.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి



ఎమ్మెల్యే కళావతికి కృతజ్ఞతలు తెలుపుతున్న లీలాప్రసాదరావు

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన వీరఘట్టం మండలం నడుకూరుకు చెందిన కర్రి లీలాప్రసాదరావుకు వీరు దిశా నిర్దేశికం చేశారు. వండవలో ఎమ్మెల్యే కళావతిని, పాలకొండలో ఎమ్మెల్యే విక్రాంత్‌ను శుక్రవారం కలిసి తనకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



కేదారిపురం రహదారిలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేయిస్తున్న ఎల్విన్‌పేట సీఐ

గుమ్మలక్ష్మీపురం: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఎల్విన్‌పేట నుంచి కేదారిపురం వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డులో పలు చోట్ల రోడ్డుకు ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరిగిపోవడంతో వాహనదారులకు ఎటువంటి అసౌకర్యం, ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉండేందుకు జంగిల్ క్లియరెన్స్ పనులను శుక్రవారం చేయించారు. ఈ పనులను పరిశీలించిన సీఐ మాట్లాడుతూ వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా జంగిల్ క్లియరెన్స్ పనులు కూడా చేయిస్తున్నట్లు చెప్పారు. వాహనదారులంతా రోడ్డు నియమాలు పాటించి క్షేమకరమైన ప్రయాణాలు సాగించాలని కోరారు. ఆయన వెంట ఎస్ఐ ఎస్.షన్ముఖరావు ఉన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



దోలుకోన రోడ్డులో పనులను పరిశీలిస్తున్న టీడబ్ల్యూ ఏఈ

గుమ్మలక్ష్మీపురం: గిరిజన గ్రామానికి రోడ్డు నిర్మాణం కల సాకరమౌతున్న వేళ.. కలకాలం నిలిచేలా నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని భద్రగిరి గిరిజన సంక్షేమ ఇంజినీరింగు శాఖ ఏఈ ఎస్.అప్పారావు అన్నారు. మండలంలోని వంగర పంచాయతీ దోలుకోన గ్రామానికి కీసర మెయిన్ రోడ్డు నుంచి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి చేపడుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం పలు చోట్ల చేపడుతున్న సీసీ రోడ్డు పనుల్లో నిబంధనలు పాటిస్తున్నదీ లేనిదీ ఆరా తీశారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, బీటీ రోడ్డు నిర్మాణం సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్లకు ఆయన సూచించారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డీపీఎం షణ్ముఖరాజు

గరుగుబిల్లి: ప్రకృతిని పరిరక్షించుకోవాలని డీపీఎం షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని తోటపల్లిలో ప్రకృతి ఆదిదేవోభవ ప్రాంగణంలో గరుగుబిల్లి, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాలకు చెందిన యూనిట్ ఇన్‌చార్జ్‌లకు రెండు రోజుల శిక్షణ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారానే ప్రకృతిని కాపాడుకునేందుకు అవకాశం వుంటుందన్నారు. సేంద్రీయ వ్యవసాయ విధానంలో సాగు చేస్తే దిగుబడులు అధికంగా రావడంతో పాటు నాణ్యమైన ఉత్పత్తులు వస్తాయన్నారు. రైతులకు ఆదాయంతో పాటు ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టీ డి.పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



సవర జాతి సంస్కృతి ప్రత్యేక కరపత్రాలు విడుదల చేస్తున్న ఎంపీడీఓ, ఆర్ట్స్ ప్రతినిధులు

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు అన్నారు. మండలంలోని కస్పాయ్యగూడ గ్రామంలో ఏక్షన్ ఇన్ రూరల్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ (ఆర్ట్స్) ఆధ్వర్యంలో గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందాలన్న లక్ష్యంతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ గిరిజనులతో మాట్లాడు తూ ప్రజల కోసం ప్రభుత్వం వైఎస్సార్ పెన్షన్ కాను క, ఆరోగ్య శ్రీ, ఆరోగ్య ఆసరా, బీమా, రైతు భరో సా వంటి అనేక పథకాలను అమలు చేస్తోందని, ఆయా పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకునేలా స్వచ్ఛంద సంస్థలు తగిన ప్రోత్సాహాన్ని అందివ్వాలని సూచించారు. అనంతరం సవర జాతి సంస్కృతి స్పెషల్ పేరుతో ప్రచురించిన వాల్‌పోస్టర్లను, కర పత్రికలను సర్పంచ్‌లు కె.వాసుదేవరావు, రాజారావు, సవర భాష అధ్యక్షుడు గోపాల్ తదితరులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్ట్స్ సిబ్బంది దుర్గారావు, చిరంజీవి, సూర్యారావు పాల్గొన్నారు.

నేడు గరుగుబిల్లిలో వైఎస్సార్ వర్ధంతి

గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి బస్టాండ్ కూడలిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం గరుగుబిల్లిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, అనుబంధ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మోదీ విధానాలను వ్యతిరేకించాలి

భామిని: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. మోదీకి వ్యతిరేకంగా చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా ఇక్కడ బాలేరు సచివాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం సచివాలయం అధికారులకు వినతిపత్రం అందజేశారు. పార్టీ నాయకులు గొర్లె జగన్నాయకులు, కొండగొర్రి భాస్కరరావు, కొప్పర మిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేత

బలిజిపేట: ఎంపీపీఎస్ నారాయణపురం-2 పాఠశాల విద్యార్థులకు కీర్తిశేషులు జి.ఉమామహేశ్వరరావు మాస్టారు జ్ఞాపకార్థం నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ శుక్రవారం పంపిణీ చేశారు. మాస్టారి జయంతి సందర్భంగా భార్య పద్మావతి, కుమార్తె ప్రియాంకలు రూ.2,100విలువ కలిగిన సామగ్రి విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు మంచిగా చదవాలన్నారు. వారిని ప్రధానోపాధ్యాయుడు రత్నాకరరా వు, ఎం.శారదాదేవి, బి.మంజుష, గ్రామస్తులు అభినందించారు.

వర్షం కోసం ఎదురు చూపులు

గుమ్మలక్ష్మీపురం: ప్రస్తుత వర్షాకాలంలో వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. ప్రారంభంలో కురిసిన వర్షాలు, తుఫాన్ల ప్రభావంతో మండల పరిధిలో సుమారు 90 శాతం మేర ఉభాలు పూర్తయ్యాయి. తర్వాత వర్షాలు కురవకపోవడంతో మండలంలోని డుమ్మంగి, రెల్ల, కోసంగిభద్ర, కేడీ కాలనీ తదితర గ్రామాల పరిధిలో ఇంకా ఉభాలు పూర్తి కాలేదు. పలు చోట్ల ఉభాలు పూర్తయినప్పటికీ పంట పొలాల్లో నీరు లేకపోవడంతో ఎండిపోతున్నాయి. ఎంతో వ్యయప్రయాసలతో ఉభాలు పూర్తి చేసినప్పటికీ వర్షాలు కురవకపోవడం వల్ల వేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



రెల్ల సమీపంలో నీటి తడులకు సైతం నోచుకోని పంట పొలం

ఆపదలో అండగా సీఎం సహాయనిధి

- రూ.లక్ష చెక్ అందజేసిన ఎమ్మెల్యే కళావతి



బాధితురాలు సత్యవతికి రూ. లక్ష సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వీరఘట్టం మండలం నడుకూరు గ్రామానికి చెందిన కలిపిల్లి మహేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. భార్య సత్యవతికి సీఎంఆర్ఎఫ్ నుంచి వచ్చిన రూ.లక్ష చెక్‌ను ఎమ్మెల్యే కళావతి శుక్రవారం వండవలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. వీటితో కుటుంబాన్ని పోషించుకోవాలని బాధితురాలికి ఎమ్మెల్యే సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పాలకొండ నియోజకవర్గంలో 350 మంది లబ్ధిదారులకు సుమారు రూ.5.50 కోట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



నీలానగరంలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: అర్హులైన అందరికీ పింఛన్లు అందజేస్తామని, పారదర్శక పాలనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. వీరఘట్టం మండలం నీలానగరంలో కొత్తగా మంజూరైన పింఛన్లను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత టీడీపీ పాలనలో అన్ని అర్హతలూ ఉన్నా పింఛన్ కావాలంటే జన్మభూమి కమిటీలకు ముడుపులు సమర్పిస్తేగాని పింఛన్లు వచ్చేవి కావని, పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తేగానే పింఛన్ అందేది కాదన్నారు. 2019లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణం స్వీకారం చేసిన తరువాత అవ్వాతాతలకు పింఛన్ కష్టాలు గట్టెక్కాయన్నారు. ఎటువంటి సిఫార్సులు లేకుండా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ పింఛన్ ఇచ్చేలా శ్రీకారం చుట్టారన్నారు. అంతేకాకుండా వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్లు అందజేస్తున్నామన్నారు. అవ్వాతాతలకు ప్రస్తుతం ఇస్తున్న వైఎస్సార్ ఫించన్ కానుకను దశల వారీగా పెంచుకుంటూ రూ.3 వేలు చేస్తానంటూ 2019 సార్వత్రిక ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహనరెడ్డి హామీ ఇచ్చారని, ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇచ్చిన హామీని నెరవేర్చుతున్నారని ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. దివ్యాంగులకు రూ.3 వేలు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి రూ.5 వేలు పింఛన్ ఇస్తూ నూతన ఒరవడికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి పురుషోత్తమరావునాయుడు, మాజీ సర్పంచ్ పకీరు నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బివర అప్పలనాయుడు, హరిబాబు, కొరికాన భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. ఇలా మండల వ్యాప్తంగా మంజూరైన 190 కొత్త పింఛన్లను అధికారులు, సర్పంచ్‌లు,ప్ర జాప్రతినిధులు లబ్ధిదారులకు అందజేశారు.

పింఛన్లు పంపిణీ చేసిన పీడీ



గుమ్మలక్ష్మీపురంలో కొత్త పింఛన్లు అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ

గుమ్మలక్ష్మీపురం: అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోందని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్ ఆధ్వర్యంలో కొత్త పింఛన్ లబ్ధిదారులకు నగదుతో పాటు పింఛన్ పుస్తకం శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పీడీ కొత్తగా పింఛన్ మంజూరైన 15 మంది లబ్ధిదారులకు వాటిని అందజేశారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తోందన్నారు. ఇకపై వలంటీర్ల ద్వారా నేరుగా ఇంటి వద్దనే పింఛన్ నగదు అందుతుందన్నారు.

ఎంపీడీఓ సాల్మన్‌రాజు మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలంలోని 24 గ్రామ సచివాలయాల నుంచి 302 మంది ఆయా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోగా, వారిలో 140 మందికి పింఛన్లు మంజూరయ్యాయని, మిగిలిన 162 మంది అర్హులో కాదో పరిశీలిస్తున్నామని చెప్పారు. అర్హులుంటే మరో మూడు రోజుల్లో వారికి కూడా పింఛన్లు మంజూరవుతాయని అన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది ఉన్నారు.

కొత్త పింఛన్ల అందజేత



కోమటిపేట సచివాలయంలో కొత్త పింఛన్ పొందిన లబ్ధిదారులతో కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది



పాలకొండ: కొత్తగా మంజూరు చేసిన పింఛన్లు పంపిణీ

పాలకొండ రూరల్: నగర పంచాయతీలో నూతనంగా అర్హత పొందిన 156 మందికి నూతనంగా వివిధ రకాల సామాజిక పింఛన్లు కౌన్సిలర్ల నేతృత్వంలో శుక్రవారం అందజేశారు. నగర పంచాయతీలోని తొమ్మిది సచివాలయాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి శుక్రవారం లబ్ధిదారులకు కొత్తగా పింఛన్లు అందజేయడంతో అర్హులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీనే వేకువజామున పింఛన్లు పంపిణీ చేయడం వల్ల తమ జీవన విధానం మెరుగుపడిందని పింఛన్ లబ్ధిదారులు సంబర పడుతున్నారు. వేకువజాము నుంచి వలంటీర్లు పట్టణంలో 3,276 మందికి పలు రకాల పింఛన్లను అందజేశారు.

కొత్త పింఛన్ల పంపిణీ

పాలకొండ: ప్రభుత్వం అర్హత ఉండి సాంకేతిక కారణాలతో పింఛన్ పొందలేని వారికి గత నెలలో నిర్వహించిన సురక్ష పథకంలో వినతులు స్వీకరించింది. ఆ సమస్యలను పరిష్కరించి అర్హత ఉన్నవారికి ఈ నెల నుంచి పింఛన్‌లు మంజూరు చేసింది. మండలంలోని కొండాపురం గ్రామంలో శుక్రవారం నూతన పింఛన్లను జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు శాసుబిల్లి జనార్ధనరావు, సర్పంచ్ రాయి వనజ లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక క్రమం తప్పకుండా ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు అందజేయడం వల్ల ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగయ్యాయని పేర్కొన్నారు. అర్హులకు పార్టీలకతీతంగా పింఛన్లు అందిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలో శుక్రవారం కొత్త పింఛన్ల పంపిణీ జరిగింది. సర్పంచ్ సవర రుతోని చేతుల మీదుగా వితంతువు బిడ్డిక నరసమ్మకు అందజేశారు. వలంటీర్ గంటా సులోచన, కన్వీనర్ గంటా కుమారి ఆధ్వర్యంలో కొత్త పింఛన్లు పంపిణీ చేపట్టారు. జగనన్న అర్హులందరికీ కొత్త పింఛన్లు అందించడం పట్ల హర్షం వెలిబుచ్చారు.

విజిలెన్స్ కమిటీ ఏర్పాటు

వీరఘట్టం: రేషన్ సరుకులను కార్డుదారులకు పారదర్శకంగా పంపిణీ చేసేందుకు మండల స్థాయి విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎస్‌డీటీ మల్లేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీకి చైర్మన్‌గా మండల తహసీల్దార్, వైస్ చైర్మన్‌గా మండల ఎంపీపీ, సభ్యులుగా జెడ్పీటీసీ, ముగ్గురు ఎంపీటీసీలు, రేషన్ డీలర్ల తరఫున ఒకరు, ఎండీఎం ఆపరేటర్ల తరఫున ఒకరు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు, దివ్యాంగులు ఒకరు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నుండి ఇద్దరు కమిటీ సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ నివేదికను కలెక్టర్‌కు నివేదించామని త్వరలో మండల విజిలెన్స్ కమిటీని ప్రకటిస్తామని తెలిపారు.